
# సినిమా న్యూస్


## సౌత్ ఇండియాలో నెంబర్ వన్ ప్లేస్‌లో 'పెద్ది'

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా, జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటించిన చిత్రం 'పెద్ది'. 'ఉప్పెన' ఫేమ్ బుచ్చిబాబు సానా దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రాన్ని వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై నిర్మించగా, ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ సంగీతం అందించారు. భారీ అంచనాల నడుమ జూన్ 4వ తేదీన విడుదలైన ఈ సినిమా మిక్స్డ్ టాక్‌ను సొంతం చేసుకున్నప్పటికీ బాక్సాఫీస్ వద్ద మంచి వసూళ్లను రాబడుతోంది. వారం రోజుల్లోనే ఈ చిత్రం 345 కోట్లకు పైగా కలెక్షన్లు సాధించినట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. తాజాగా ఈ సినిమా వసూళ్లకు సంబంధించిన మరో అప్డేట్‌ను విడుదల చేశారు.

ఈ ఏడాది సౌత్ ఇండియాలో అత్యధిక గ్రాస్ కలెక్షన్లు సాధించిన చిత్రాల్లో 'పెద్ది' నెంబర్ వన్ స్థానంలో నిలిచిందని అధికారికంగా వెల్లడించారు. ప్రస్తుతం ఈ సినిమా రెండో వారం రన్ కొనసాగుతోంది. పూర్తి బాక్సాఫీస్ రన్ ముగిసే సమయానికి ఈ చిత్రం ఎన్ని కోట్ల వసూళ్లు సాధిస్తుందనేది ఆసక్తికరంగా మారింది. ఇక ఇప్పటివరకు రామ్ చరణ్ కెరీర్‌లో సోలో హీరోగా వచ్చిన సినిమాల్లో ఇదే అత్యధిక కలెక్షన్లు సాధించిన చిత్రంగా నిలిచింది. దీంతో రామ్ చరణ్ కెరీర్‌లోనే ఇది భారీ విజయాన్ని అందుకున్న సినిమాగా ట్రేడ్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.




## ఓజీ–2 లోడింగ్




పవర్ స్టార్ పవన్ కల్యాణ్ ఫ్యాన్స్‌కు పండుగ చేసుకునే అప్డేట్ ఒకటి వచ్చేసింది. 'ఉస్తాద్ భగత్ సింగ్' రిజల్ట్ తర్వాత డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ యాక్టింగ్‌కు ఫుల్‌స్టాప్ పెట్టేశారని, ఇక రాజకీయాలపైనే పూర్తి ఫోకస్ పెట్టబోతున్నారని గత కొద్ది రోజులుగా నెట్టింట వార్తలు వైరల్ అవుతున్న విషయం తెలిసిందే. వైరల్ న్యూస్‌కు చెక్ పెడుతూ 'పవర్ కల్యాణ్ క్రియేటివ్ వర్క్స్' అఫీషియల్ అకౌంట్ నుంచి ఒక సాలిడ్ అప్డేట్ వచ్చింది. 'మాట ఇచ్చినట్లే ఆయన చేస్తారు.. సమయం ఎప్పుడనేది ఆయన మనకు తెలియజేస్తారు.. సుజీత్ విదేశాల నుండి తిరిగి వచ్చాక మనం చర్చిద్దాం.. OG2' అంటూ ఓ ప్రకటన రిలీజ్ చేశారు. ప్రస్తుతం ఈ వార్త వైరల్ అవుతుండగా.. ఫ్యాన్స్ ఫుల్ ఖుష్ అవుతున్నారు. కాగా.. పవన్ కల్యాణ్ ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'ఓజీ'. డీవీవీ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై డీవీవీ దానయ్య, ముప్పాళ రంగ రామన్ నిర్మించిన ఈ సినిమాకు సుజీత్ దర్శకత్వం వహించాడు. ఇమ్రాన్ హష్మీ, ప్రియాంకా అరుళ్ మోహన్, శ్రియా రెడ్డి, ప్రకాష్ రాజ్ ప్రధాన పాత్రల్లో నటించిన ఈ మూవీ 2025లో విడుదలై మిక్స్‌డ్ టాక్ సొంతం చేసుకుంది.

## వెండితెరపై సింగీతం రాసిన చందమామ కథ




వెండితెరపై ఆదిత్య 369, భైరవ ద్వీపం వంటి ఎన్నో అద్భుత ప్రయోగాలు, సంచలన చిత్రాలను ఆవిష్కరించిన లెజెండరీ దర్శకుడు సింగీతం శ్రీనివాసరావు. లాంగ్ గ్యాప్ తర్వాత మరోసారి తన మార్క్ ఆలోచనతో సింగ్ గీతం అనే సినిమా సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చారు సింగీతం. 94 ఏళ్ల వయసులో కూడా సింగీతం సినిమాపై చూపిస్తున్న పట్టుదల, ఎవరు ఊహించాని కథలతో ప్రేక్షకుల ముందుకు రావడం ఇండస్ట్రీ వర్గాలతో పాటు సినీ ప్రియులను ఎంతగానో ఆశ్చర్యపరుస్తోంది. ఒక వైవిధ్యమైన, విభిన్నమైన కథను సినిమా రూపంలోకి తీసుకురావాలనే సింగీతం ఆలోచనను గౌరవించి, దానికి అండగా నిలిచిన యంగ్ అండ్ టాలెంటెడ్ డైరెక్టర్ నాగ్ అశ్విన్‌ను ఈ సందర్భంగా ఖచ్చితంగా అభినందించాలి.

సింగీతం శ్రీనివాసరావుపై ఉన్న గౌరవంతో వినూత్న ప్రయోగానికి నాగ్ అశ్విన్ తోడ్పడడం విశేషం. గత రాత్రి ప్రీమియర్స్ తో విడుదలైన సింగ్ గీతం సినిమాకు బాక్సాఫీస్ టాక్‌తో కానీ, విశ్లేషకుల రివ్యూలతో కానీ అస్సలు పని లేదు. 94 ఏళ్ల వయసులో కూడా ఒక దర్శకుడు సినిమా కోసం చేసిన అద్భుతమైన ఐడియాని, ప్యాషన్‌ని ప్రతి ఒక్కరూ థియేటర్ కి వెళ్లి తప్పకుండా చూడాల్సిందే. ఈ వయసులో కూడా సింగీతం గారు కథను విజువలైజ్ చేసి తెరకెక్కించిన విధానం చాలా అద్భుతంగా ఉంది. దేవి శ్రీ ప్రసాద్ తన అద్భుతమైన మ్యూజిక్ మరియు బ్యాక్‌గ్రౌండ్ స్కోర్‌తో సినిమాను నెక్స్ట్ లెవెల్‌కు తీసుకెళ్లారు. సినిమాను ప్రేమించే ప్రతి ఒక్కరూ థియేటర్లలో చూడదగ్గ ఒక గొప్ప ప్రయోగం ఇది. ముఖ్యంగా క్లైమాక్స్ మిమ్మల్ని కదిలిస్తుంది. హాస్యం, మానవత్వం, సంగీతం, భావోద్వేగాలు కలిసి రూపొందిన అద్భుతమైన దృశ్య కావ్యం సింగ్ గీతం. అనుకూర్ సీ సినిమాటోగ్రఫీ ఈ చిత్రానికి మరో పెద్ద బలం. ఇంతకుముందు వెండితెరపై ఎప్పుడూ చూడని ఒక కొత్త సినీ ప్రయోగం. ఒక్క మాటలో చెప్పాలంటే సింగ్ గీతం ఓ మాస్టర్‌పీస్.

## జైలర్ 2లో బాలీవుడ్ గ్రీక్ గాడ్ స్పెషల్ క్యామియో




సూపర్ స్టార్ రజనీకాంత్, సెన్సేషనల్ డైరెక్టర్ నెల్సన్ దిలీప్ కుమార్ కాంబినేషన్‌లో రాబోతున్న మోస్ట్ అవైటెడ్ సీక్వెల్ 'జైలర్ 2' గురించి నెట్టింట ఒక సంచలన వార్త హల్‌చల్ చేస్తోంది. ఈ చిత్రంలో బాలీవుడ్ గ్రీక్ గాడ్ హృతిక్ రోషన్ ఒక పవర్‌ఫుల్ క్యామియో చేయబోతున్నారట. కేవలం అతిథి పాత్రలా వచ్చి వెళ్ళిపోయేలా కాకుండా, కథలో ఎంతో ప్రాధాన్యత ఉన్న రోల్ అని సమాచారం. సినిమా కథను ఒక కీలకమైన మలుపు తిప్పే సందర్భంలో హృతిక్ క్యారెక్టర్ ఎంట్రీ ఇస్తుందని సమాచారం. టైగర్ ముత్తువేల్ పాండియన్ కథను ముందుకు తీసుకెళ్లే క్రమంలో హృతిక్ పాత్ర ఉండబోతుంది. ఈ ఇద్దరు సూపర్ స్టార్స్ కలిసే సన్నివేశాలను మేకర్స్ అత్యంత భారీ స్థాయిలో గ్రాండ్‌గా విజువలైజ్ చేయడానికి ప్లాన్ చేస్తున్నారు.

జూన్ మూడో వారంలో, ముఖ్యంగా జూన్ 22, 23 తేదీల్లో చెన్నైలో ఈ కీలక షెడ్యూల్ షూటింగ్ జరగనున్నట్లు ఇండస్ట్రీ టాక్. ఈ షూటింగ్‌లో పాల్గొనడానికి ముందే హృతిక్ రోషన్‌పై లుక్ టెస్ట్‌లు నిర్వహించనున్నారు. ఈ సినిమాలో హృతిక్‌ను మునుపెన్నడూ చూడని ఒక కంప్లీట్ డిఫరెంట్ లుక్‌లో చూపించబోతున్నారట. అలాగే ఈ రోల్ ఫుల్ యాక్షన్ ప్యాక్డ్‌గా, హై-వోల్టేజ్ రేంజ్‌లో ఉండబోతుందని తెలుస్తోంది. ఇదిలా ఉండగా దాదాపు 40 సంవత్సరాల తర్వాత రజనీకాంత్, హృతిక్ రోషన్ ఒకే స్క్రీన్‌పై కనిపించబోతున్నారు. గతంలో 1986లో వచ్చిన 'భగవాన్ దాదా' అనే హిందీ సినిమాలో హృతిక్ బాలనటుడిగా రజనీకాంత్‌తో కలిసి నటించారు. మళ్లీ ఇన్నాళ్లకు 'జైలర్ 2' ద్వారా ఈ ఇద్దరు స్టార్స్ కలవబోతుండడం విశేషం. సన్ పిక్చర్స్ నిర్మిస్తున్న ఈ భారీ చిత్రంలో మోహన్ లాల్, శివరాజ్ కుమార్, విజయ్ సేతుపతి, మిథున్ చక్రవర్తి వంటి స్టార్స్ కూడా భాగం కానుండడంతో సినిమాపై అంచనాలు స్కై హైకి చేరాయి.

## ఒకటి కాదు రెండు థియేటర్ దద్దరిల్లిపోద్ది

మాస్ మహారాజ రవితేజ హీరోగా, డైరెక్టర్ శివ నిర్వాణ దర్శకత్వంలో తెరకెక్కుతున్న లేటెస్ట్ అవైటెడ్ మూవీ 'ఇరుముడి'. మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్ పై ఎంతో ప్రతిష్టాత్మకంగా రూపొందుతున్న ఈ చిత్రంపై ఇండస్ట్రీ వర్గాలతో పాటు ప్రేక్షకుల్లోనూ భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇటీవల విడుదలైన ఈ సినిమా గ్లింప్స్.. తండ్రీకూతుళ్ల సెంటిమెంట్‌తో పాటు భక్తిభావంతో కూడిన ఎమోషన్స్‌తో ఆడియన్స్‌ను ఎంతగానో ఆకట్టుకుంది. తాజాగా ఈ క్రేజీ ప్రాజెక్ట్ నుంచి ఒక ఇంట్రెస్టింగ్ మ్యూజికల్ అప్‌డేట్ బయటకు వచ్చింది.

ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్న మ్యూజిక్ డైరెక్టర్ జివి ప్రకాష్ కుమార్.. అయ్యప్ప స్వామి నేపథ్యంలో సాగే రెండు భక్తి పాటలను కంపోజ్ చేశారట. ఈ రెండు పాటలు సినిమాలో కథను మలుపు తిప్పే సందర్భంలో ఎంతో కీలకంగా ఉంటాయని తెలుస్తోంది. ఇందులో ఒకటి ఎప్పుడూ ట్రెండింగ్‌లో ఉండే అయ్యప్ప స్వామి సాంగ్ 'బంగారు పల్లకి' కాగా.. మరో కొత్త ట్యూన్ మామూలుగా ఉండదని టాక్. ఈ సినిమాలో రవితేజ తన రెగ్యులర్ మాస్ ఇమేజ్‌కు భిన్నంగా, ఒక కూతురి కోసం వ్యసనాలను వదిలి అయ్యప్ప మాల ధరించే ఎమోషనల్ తండ్రి పాత్రలో కనిపించబోతున్నారు. రవితేజ సరసన ప్రియా భవానీ శంకర్ హీరోయిన్‌గా నటిస్తుండగా.. దర్శకుడు శివ నిర్వాణ ఎంతో హార్ట్ టచింగ్‌గా విజువలైజ్ చేస్తున్నట్లు సమాచారం. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఈ ఏడాది ఆగస్టు 21న ప్రపంచవ్యాప్తంగా ఇరుముడిని థియేటర్లలో భారీ స్థాయిలో విడుదల చేయడానికి మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. మరి ఈ ఎమోషనల్ అండ్ డివోషనల్ డ్రామా బాక్సాఫీస్ వద్ద రవితేజకు ఎలాంటి విజయాన్ని అందిస్తుందో చూడాలి.

